జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 28 | జులై | 2026 ◆ పేజీలు : 5



## ప్రజావాణిలో వచ్చిన వినతికి సకాలంలో పరిష్కారం చూపాలి

♦ జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 27,(ప్రజాజ్యోతి)** సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల

మిగతా 2 లో...




2 లో..

- కారు పార్టీలో జోరుగా ప్రచారం
- వనమా తర్వాత కొత్త ముఖంపై అధిష్ఠానం దృష్టి..?
- క్షేత్రస్థాయి వ్యూహంతో చురుగ్గా ముందుకెళ్తున్న వద్దిరాజు
- జిల్లా రాజకీయాలపై చాలాకాలంగా ప్రత్యేక కార్యాచరణ
- గ్రామస్థాయి నుంచి కేడర్ బలోపేతంపై దృష్టి
- ఇక అధికారిక ఖరారే తరువాయి..

# ఇక వద్దిరాజే... కొత్తగూడెం బీఆర్ఎస్ అభ్యర్థి..?

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) రాజకీయాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, పార్టీ ఇప్పటికే నియోజకవర్గాల వారీగా రాజకీయ సమీకరణాలపై దృష్టి పెట్టినట్లు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కొత్తగూడెం నుంచి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రనే బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దించే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

## గ్రామాల అభివృద్ధే లక్ష్యం..



- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ
- రూ.46 లక్షల పనులకు శ్రీకారం

**ములకలపల్లి, జూలై 27 (ప్రజాజ్యోతి):** గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. సోమవారం ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి, కుమ్మరిపాడు, గుట్టగూడెం పంచాయతీల పరిధిలోని మామిళ్లగూడెం, అలాగే ములకలపల్లి గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి రూ.46 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పనులను ప్రారంభించడంతో పాటు పలు నూతన పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. చాపరాలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం లబ్ధిదారులు బొల్లెపూగు సిసింద్రీ, గద్దల సంధ్య, కొండ్రు నాగమణి, సిద్దెల సంధ్యల ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.కుమ్మరిపాడు గ్రామంలో పద్దం నాగమణి, పద్ధం కృష్ణవేణి, పద్దం రాణి, పద్ధం ఉమా రాణి, పద్దం రమిత, నన్నపనేని మాణికుమారి నిర్మించుకున్న

మిగతా 2 లో...

## సులానగర్ పీహెచ్సీలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ



- రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వద్దు: కోరం కనకయ్య
- గర్భిణీలకు మెరుగైన సేవలు, ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై విశ్వాసం పెంచాలని సూచన

2 లో...

- మూడుసార్లు సీజ్ చేసిన తోగ్గూడెం క్వారీలపై తేలాల్సిన వాస్తవాలు
- సమగ్ర విచారణ కోరుతూ కొంతకాలంగా ప్రజా సంఘాల ఆందోళన
- గతంలో రాజకీయ పార్టీలు.. ఇప్పుడు గిరిజన, ప్రజా సంఘాలూ ఒకే డిమాండ్
- రాయల్టీ నష్టం, ఆర్టీఐ వివరాలు, పర్యావరణ అంశాలపై ప్రశ్నలు
- పారదర్శక విచారణతోనే అనుమానాలకు తెరపడుతుందన్న అభిప్రాయం
- అధికారుల మౌనం వెనుక పలు అనుమానాలు..




5 లో..

# మైనింగ్ అక్రమాలపై మౌనం ఎందుకు..?

## సులానగర్ పీహెచ్సీపై ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

**టేకులపల్లి, జూలై 27, ప్రజాజ్యోతి:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతి వైద్య సిబ్బంది బాధ్యత అని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం ఉదయం టేకులపల్లి మండలం సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ)ను ఆకస్మికంగా సందర్శించిన ఆయన ఆసుపత్రి పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే, చికిత్స పొందుతున్న రోగులను నేరుగా కలిసి వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది స్పందనపై ఆరా తీశారు. ముఖ్యంగా గర్భిణీలకు అవసరమైన పరీక్షలు, మందులు, వైద్య సేవలు సకాలంలో అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యాధికారులకు సూచించారు.రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడద ని,ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరితో వైద్య సిబ్బంది ఆప్యాయంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, సిబ్బంది హాజరు, వైద్య సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే, ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.ఈ తనిఖీలో స్థానిక వైద్యాధికారి డా. కంచర్ల వెంకటేష్, సర్పంచ్ పూల్ బంతి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే లక్ష్యం..

(మొదటి పేజీ తరువాయి...)

ఆరు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. గుట్టగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, మామిళ్లగూడెంలో లబ్ధిదారు సడియం కుమారి ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ములకలపల్లి రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో రూ.5,33,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామాల అభివృద్ధికి కేటాయించిన ప్రతి రూపాయిని పారదర్శకంగా వినియోగించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాహిర్, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, మాజీ సర్పంచ్ కారం సుధీర్, ఎస్ఐఆర్ మండల ఇన్‌చార్జి మద్దిశెట్టి సత్యప్రసాద్, ములకలపల్లి సర్పంచ్ చంద్రలేఖ, పాలకుర్తి రత్నం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పేటేటి నరసింహారావు, అమర్‌నాథ్, కరుటూరి కృష్ణ, యూత్ కాంగ్రెస్ నాయకుడు సుమిత్, ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ సురభి రాజేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రవి, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బూరుగుపల్లి పద్మశ్రీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీఓ వెంకటేశ్వరరావు

- **ఎంపీడీవో సంకీర్తలకు ఘన సన్మానం**

**పినపాక, జులై 27(ప్రజాజ్యోతి):** నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీఓ వెంకటేశ్వరరావుతో పాటు పినపాక మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) సంకీర్తను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వారికి శాలువాలు కప్పి, శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గ, మండల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో, మండల సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో ఉంటూ, మండలాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు శ్రమించాలని కోరారు. తమపై నమ్మకంతో సహకరిస్తున్న కాంగ్రెస్ నాయకులకు, శ్రేణులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, లక్షారెడ్డి జిల్లా సెక్రటరీ బోడ రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు చిట్టిమల్ల ప్రసాద్, సర్పంచులు, ఉపసర్పంచ్లు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రజావాణిలో వచ్చిన వినతికి సకాలంలో పరిష్కారం చూపాలి

(మొదటి పేజీ తరువాయి...)

అదనపు కలెక్టర్ విద్యా చందన తో కలసి స్వీకరించారు. భూ వివాదాలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, మౌలిక వసతులు, సామాజిక భద్రతతో పాటు ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేసే విశ్వసనీయ వేదిక అని అన్నారు . ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని పరిశీలించి, నిర్దేశిత గడువులో పరిష్కరించేలా సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని వినతులు జూలూరుపాడు మండలం పడమటి నరసాపురం గ్రామానికి చెందిన పారుపల్లి నాగలక్ష్మి తాను ఎంఎస్సీ వరకు విద్యాభ్యాసం పూర్తి చేసి ఉద్యోగం లభించక



ఖాళీగా ఉన్నాను అని,కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఏదైనా ప్రభుత్వ కార్యాలయాల్లో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉపాధి కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దీనిపై జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారికి ఎండార్స్ చేశారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గౌతంపూర్‌కు చెందిన లక్ష్మి, 25 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన ఇల్లు, స్థలం ఇప్పటికీ విక్రేత పేరుమీదే నమోదై ఉందని, సర్వే పూర్తయినప్పటికీ తన పేరుపై పట్టాదారు పాస్‌పుస్తకం జారీ కాలేదని, వినతిపత్రం సమర్పించారు. దీనిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. ఇల్లందు మండలం వేపలగడ్డ గ్రామ పంచాయతీ బొచ్చాయిగూడెంకు చెందిన బుగ్గ పద్మ, తన భర్త 2024లో మృతి చెందారని, ఆయన పేరిట ఉన్న 4 ఎకరాల 25 గుంటల ఆర్ఓఎఫ్ఆర్ భూమిని తన పేరుకు మార్చి రైతు భరోసా పథకం వర్తింపజేయాలని కోరారు. ఈ వినతిపై తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత సెక్షన్ సూపరింటెండెంట్‌కు జిల్లా కలెక్టర్ ఎండార్స్ చేశారు. అన్నపురెడ్డిపల్లి మండలం అన్నపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డేపల్లి రత్నకుమారి తాము నిరుపేదలమని, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎల్-3 జాబితాలో మంజూరైన ఇంటిని ఎల్-1కు మార్చి ఇంటి కేటాయింపు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి జిల్లా కలెక్టర్ ఎండార్స్ చేశారు. అశ్వరావుపేట మండలం మల్లాయిగూడెం గ్రామానికి చెందిన బేతి వెంకాయమ్మ ఆసుపాక రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 191/6లో ఉన్న 4 ఎకరాల 20 గుంటల భూమికి సంబంధించిన అన్ని పత్రాలు ఉన్నప్పటికీ ఆన్‌లైన్ లో నమోదు కాకపోవడంతో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం జారీ కావడం లేదని వినతిపత్రం సమర్పించారు. దీనిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ సమస్యను త్వరితగతిన పరిష్కరించి కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేయాలని అశ్వరావుపేట తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ఇక వద్దిరాజే కొత్తగూడెం బీఆర్ఎస్ అభ్యర్థి..?

దీనిపై అధికారిక ప్రకటన వెలువడకపోయినా, ఇటీవల నియోజకవర్గంలో ఆయన పెంచిన రాజకీయ చురుకుదనం ఈ ప్రచారానికి మరింత బలం చేకూరుస్తోంది.

### ♦ ఇక్కడ బీఆర్ఎస్ ప్రస్థానం..

కొత్తగూడెం నియోజకవర్గంలో బీఆర్ఎస్ రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే 2014లో అప్పటి టీఆర్ఎస్ తరపున జలగం వెంకట్రావు విజయం సాధించారు. అనంతరం 2018లో కాంగ్రెస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు గెలిచి తర్వాత టీఆర్ఎస్‌లో చేరారు. 2023 ఎన్నికల్లో కూడా పార్టీ ఆయనకే అవకాశం ఇచ్చింది. అయితే ఆశించిన ఫలితం రాకపోవడంతో ఈసారి కొత్త నాయకత్వానికి అవకాశం కల్పించాలనే ఆలోచనలో పార్టీ ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని గెలుపు అవకాశాలను పెంచే నాయకత్వానికే ప్రాధాన్యం ఇవ్వాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. వనమా కుటుంబానికి కొత్తగూడెం రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు ఉన్నప్పటికీ, గత కొంతకాలంగా చోటుచేసుకున్న పరిణామాల తర్వాత పార్టీలో వారి ప్రాధాన్యం తగ్గిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ఫలితాలు, మారిన రాజకీయ పరిస్థితులు, పార్టీ అంతర్గత సమీకరణాలు కలిసి ప్రత్యామ్నాయ నాయకత్వంపై అధిష్ఠానం దృష్టి పెట్టే పరిస్థితి ఏర్పడిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అయితే దీనిపై అధికారిక నిర్ణయం వెలువడకపోయినా, ఈసారి కొత్త ముఖాన్ని ముందుకు తీసుకురావాలనే చర్చ మాత్రం బలంగా వినిపిస్తోంది.

### ♦ గ్రామస్థాయి నుండి దృష్టి సారిస్తూ..

ఈ పరిస్థితుల్లోనే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పేరు ముందువరుసలో నిలుస్తోంది. జిల్లా రాజకీయాలపై చాలా కాలంగా పట్టు సాధించిన ఆయన, గత ఎన్నికల సమయంలో కూడా పార్టీ వ్యవహారాల్లో చురుకుగా పనిచేసిన నాయకుడిగా గుర్తింపు పొందారు. అందుకే జిల్లాతో పాటు కొత్తగూడెం నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులతో ఆయనకు సన్నిహిత పరిచయాలు ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గ్రామస్థాయి కార్యకర్తల నుంచి జిల్లా స్థాయి నాయకుల వరకు విస్తృత స్థాయిలో సమన్వయం చేసుకునే సామర్థ్యం ఆయనకు ఉందనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. ఇటీవల ఆయన కొత్తగూడెం నియోజకవర్గంపై మరింత దృష్టి కేంద్రీకరించినట్లు కనిపిస్తోంది. తరచూ గ్రామాల్లో పర్యటించడం, స్థానిక నాయకులతో సమావేశాలు నిర్వహించడం, వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులతో చర్చలు జరపడం, పార్టీ కార్యకర్తలతో నిరంతరం అందుబాటులో ఉండడం వంటి కార్యక్రమాలతో క్షేత్రస్థాయిలో తన ఉనికిని బలోపేతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. గ్రామాల వారీగా పార్టీ సంస్థాగత బలాన్ని పెంచేందుకు కూడా కసరత్తు జరుగుతోందనే చర్చ సాగుతోంది. అదే సమయంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా చిన్నచిన్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తూ స్థానికంగా తన గుర్తింపును మరింత పెంచుకునే ప్రయత్నం చేస్తున్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. అందులో భాగంగా కొత్త అంజనాపురం గ్రామ పంచాయతీలోని రూప్లాతండ గ్రామానికి తాగునీటి అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని బోరు ఏర్పాటు చేయడానికి సహకరించిన అంశాన్ని కూడా ఆయన అనుచరులు ఉదాహరణగా ప్రస్తావిస్తున్నారు. దీంతో ఇటువంటి కార్యక్రమాల ద్వారా గ్రామ స్థాయిలో ప్రజలతో అనుబంధాన్ని పెంచుకునే వ్యూహంతో ముందుకు వెళ్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ♦ ప్రధాన పార్టీల నుండి సవాలే..

అయితే కొత్తగూడెం రాజకీయ సమీకరణాలు బీఆర్ఎస్‌కు మాత్రం అంత సులభంగా కనిపించడం లేదు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికార పార్టీగా తన బలాన్ని కొనసాగించే ప్రయత్నం చేస్తుండగా, క్షేత్రస్థాయిలో సీపీఐ కూడా ఇక్కడ బలమైన రాజకీయ శక్తిగానే ఉంది. ప్రజా సమస్యలపై ఉద్యమాలు, రైతులు, కార్మికులు, గిరిజనుల అంశాలపై నిరంతర పోరాటాలతో సీపీఐ తన కేడర్‌ను చురుగ్గా ఉంచుతోంది. ప్రస్తుత ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కూడా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కావడంతో ఆ పార్టీ ప్రభావం ఇక్కడ ఇంకా ఎక్కువగా కొనసాగుతోంది. ఈ పరిస్థితుల్లో గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న అభ్యర్థిని ఎంపిక చేయడంపైనే బీఆర్ఎస్ అధిష్ఠానం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు గత ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తూ పార్టీ సంస్థాగత బలాన్ని పెంచడం, గ్రామ స్థాయి నాయకత్వాన్ని బలోపేతం చేయడం, సామాజిక సమీకరణాలకు అనుగుణంగా వ్యూహాలను రూపొందించడం వంటి అంశాలపై బీఆర్ఎస్ ఇప్పటికే కసరత్తు ప్రారంభించినట్లు ప్రచారం సాగుతోంది. అందులో భాగంగానే కొత్తగూడెం అభ్యర్థి ఎంపికపై కూడా ముందుగానే చర్చలు మొదలైనట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇప్పటివరకు బీఆర్ఎస్ అధిష్ఠానం అధికారికంగా అభ్యర్థిని ప్రకటించకపోయినా, కొత్తగూడెం రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాలు మాత్రం వేగంగా మారుతున్నాయి. పార్టీ అంతర్గత చర్చలు, నాయకుల కదలికలు, క్షేత్రస్థాయిలో పెరుగుతున్న రాజకీయ చురుకుదనాన్ని బట్టి చూస్తే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పేరు బలంగా వినిపిస్తోంది. చివరకు అధిష్ఠానం ఈ ప్రచారాన్నే అధికారికంగా ఖరారు చేస్తుందా, లేక చివరి దశలో మరో నిర్ణయం తీసుకుంటుందా అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది. కాకపోతే ప్రస్తుతం మాత్రం కొత్తగూడెం బీఆర్ఎస్ రాజకీయాల్లో అత్యంత చర్చనీయాంశంగా మారింది "ఇక వద్దిరాజే అభ్యర్థి..?" అనే ప్రశ్నే.

# మావోయిస్టుల పేరుతో బ్యానర్లు...ఇద్దరు అరెస్ట్



**చర్ల , జూలై 27(ప్రజా జ్యోతి ):** గడ్చిరోలి జిల్లాలో మావోయిస్టుల పేరుతో పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేసి ప్రజల్లో భయాందోళనలు సృష్టించిన ఘటనలో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మరో నిందితుడి కోసం గాలింపు కొనసాగుతోంది.పోలీసుల వివరాల ప్రకారం ఈ నెల 12న జిజావండి–తోలుకడే జనయ రహదారి సమీపంలోని పిప్లీ బుర్గి గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఎర్రటి రంగు బ్యానర్లు, పోస్టర్లు, దిశా సూచికలు, ఇతర వస్తువులు గుర్తించారు. వీటిని మావోయిస్టుల పేరుతో ఏర్పాటు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేసినట్లు పోలీసులు అనుమానించారు.ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన జిల్లా ఎస్పీ ఎం. రమేష్ ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, రహస్య సమాచారంతో నిందితులను గుర్తించారు.ఈ కేసులో శివ అనిల్ మిస్త్రీ (48), తరుణ్‌నగర్, పఖంజూర్, కాంకేర్ జిల్లా (ఛత్తీస్‌గఢ్), రోహిత్ రంజిత్ మల్లిక్ (25), వటేలి, ఎటపల్లి, గడ్చిరోలి జిల్లాలను అరెస్టు చేశారు. మరో నిందితుడి కోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు.నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బి యెన్ ఎస్ ) లోని సంబంధిత సెక్షన్లతో పాటు చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యు ఏ పీ ఏ ) కింద కేసులు నమోదు చేశారు.గడ్చిరోలి జిల్లాలో మావోయిస్టు ప్రభావాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసులు చేపట్టిన "ఆపరేషన్ ఫైనల్ స్ట్రైక్" విజయవంతంగా కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజల్లో భయాందోళనలు సృష్టించే కుట్రలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఎస్పీ హెచ్చరించారు.ప్రజలు ఎలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ ఎం. రమేష్ విజ్ఞప్తి చేశారు. అలాగే మావోయిస్టుల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## వరి సాగుకు బదులు ప్రత్యామ్నాయ పంటలే మేలు

- **ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచన**
- **కోయగూడెంలో విత్తన మేళా ప్రారంభం.. కంది, పెసర, కూరగాయల విత్తనాల పంపిణీ**





**టేకులపల్లి, జూలై 27,ప్రజా జ్యోతి:** వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగుకు బదులుగా పప్పుధాన్యాలు, ఆరుతడి పంటలు, తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికలో అప్రమత్తంగా వ్యవహరిస్తేనే రైతులు నష్టాలను నివారించగలరని ఆయన అన్నారు.టేకులపల్లి మండలం కోయగూడెం రైతు వేదికలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'విత్తన మేళా–2026' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రైతులకు కంది, పెసర, వివిధ రకాల కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ,రాష్ట్రంలో వర్షపాతం అనిశ్చితంగా ఉండే అవకాశాలు ఉన్నందున రైతులు వ్యవసాయ శాఖ సూచించిన పంటల ప్రణాళికను అనుసరించాలని సూచించారు. ముఖ్యంగా వర్షాధారిత ప్రాంతాల్లో వరి సాగును తగ్గించి కంది, పెసర, మినుము, శనగ, నువ్వులు వంటి పప్పుధాన్యాలు, ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా తక్కువ నీటితో మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.బోరుబావులపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులు కూడా నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరమయ్యే వరి సాగు భూగర్భ జలాలపై తీవ్ర ఒత్తిడి పెంచుతుందని, పంటల వైవిధ్యీకరణతో సాగు వ్యయం తగ్గడంతో పాటు రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు.ప్రభుత్వం సూచించిన పంటల ప్రణాళికను తప్పనిసరిగా అమలు చేయాలని, యూరియాను వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదులోనే విడతల వారీగా వినియోగించాలని సూచించారు. శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ వ్యవసాయ అధికారుల సాంకేతిక సలహాలను అనుసరిస్తే వాతావరణ మార్పుల ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు.జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన నాణ్యమైన విత్తనాలు జిల్లాలో సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు ధృవీకరించిన విత్తనాలనే వినియోగించాలని, పంటల ఎంపిక, సమతుల్య ఎరువుల వినియోగం,నీటి యాజమాన్యం, సమగ్ర చీడపీడల నివారణలో వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని కోరారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు నిరంతరం సాంకేతిక సలహాలు అందిస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమం లో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల వ్యవసాయ అధికారి,వ్యవసాయ విస్తరణ అధికారులు,రైతు వేదిక కమిటీ సభ్యులు, రైతు సంఘాల ప్రతినిధులు, మహిళా రైతులు, ప్రగతిశీల రైతులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మకు నదీ జలాలతో అభిషేకం





**చర్ల, జూలై 27 :(ప్రజాజ్యోతి ):** చర్ల మండలం అంజనాపురం గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారి ప్రతిష్టించి ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు గ్రామ పెద్దలు, యువకులు అన్ని ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా మహిళలు మేళతాళాల నడుమ గోదావరి నది జలాలను తీసుకొచ్చి అమ్మవారికి పవిత్రాభిషేకం నిర్వహించారు. గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామంలో ఎలాంటి చీడపీడలు, అంటువ్యాధులు ప్రబలకుండా కాపాడాలని అమ్మవారిని వేడుకున్నారు.అనంతరం భక్తులు సంప్రదాయబద్ధంగా తయారు చేసిన బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది.

## సింగరేణి ఉద్యోగులకు పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు

- **టేకులపల్లిలో క్వార్టర్స్ కౌన్సిలింగ్ నిర్వహణ**



**టేకులపల్లి,జూలై 27,ప్రజా జ్యోతి:** సింగరేణి ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ వి. కృష్ణయ్య ఆదేశాల మేరకు సోమవారం టేకులపల్లి హైటెక్ కాలనీలోని సీఈఆర్ క్లబ్‌లో సింగరేణి అధికారులు, ఉద్యోగుల కోసం ఎంబీ, ఎంసీఎండీ క్వార్టర్ల కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఫ్రెష్ అలాట్ మెంట్ , క్వార్టర్ మార్పు (చేంజ్ ఆఫ్ క్వార్టర్) కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ఉద్యోగులకు నిబంధనల ప్రకారం క్వార్టర్లు కేటాయించారు. అడిషనల్ ఎస్‌వో టు జీఎం, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సి.ఆర్. భాను ప్రసాద్ మాట్లాడుతూ, అర్హులైన ఉద్యోగులకు త్వరలో క్వార్టర్ అలాట్ మెంట్ ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. క్వార్టర్ అలాట్ మెంట్ కమిటీ పూర్తిస్థాయి పారదర్శకత తో,ఎలాంటి సిఫార్సులకు తావు లేకుండా, సంస్థ నిబంధనల ప్రకారమే క్వార్టర్లను కేటాయిస్తోందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్ ) అజ్మీర తుకారాం, ఏరియా ఇంజనీర్ ఐ.వి.ఎస్.సి. లక్ష్మణమూర్తి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ జి. సుధాకర్, క్లార్క్ జి. వీరన్న, తిరుపతి తదితర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం



**చర్ల, జూలై 27(ప్రజాజ్యోతి ):** చర్ల మండలంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మండలానికి చెందిన 109 మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు రెండు విడతలుగా నిర్వహించిన మూడు రోజుల సమగ్ర వృత్యంతర శిక్షణ కార్యక్రమం సోమవారం విజయవంతంగా ముగిసింది. జూలై 22 నుంచి 27 వరకు నిర్వహించిన ఈ శిక్షణలో ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాల పెంపు, విద్యార్థుల అభ్యాస నైపుణ్యాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.శిక్షణలో ప్రాథమిక అక్షరాస్యత, గణిత నైపుణ్యాల పెంపు, సమర్థవంతమైన బోధనా విధానాలు, తరగతి గది నిర్వహణ, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల, సమయపాలన, పాఠశాల నిర్వహణ తదితర అంశాలపై నిపుణులు సమగ్రంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి పి.వి. రమణ , రిసోర్స్ పర్సన్లు గా చిడెం హిమగిరిబాబు, తోకల లక్ష్మీపతి, పొడియం నాగేశ్వరరావు, వీసం అంజయ్య వ్యవహరించారు. అలాగే వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొనగా శిక్షణను విజయవంతంగా నిర్వహించిన శిక్షక బృందాన్ని అధికారులు అభినందించారు.

## కేజీబీవీ అన్నపురెడ్డిపల్లి కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

- **ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీ సీట్ల భర్తీ**
- **ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో జూలై 31 వరకు ప్రవేశాలు**



**అన్నపురెడ్డిపల్లి, జూలై 27 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రత్యేక అధికారి డి. శారద తెలిపారు.కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఖాళీ సీట్లు ఉన్నాయని, అర్హత కలిగిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఆసక్తి గల విద్యార్థినులు అవసరమైన ధ్రువపత్రాలతో నేరుగా కళాశాలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లకు జూలై 31 వరకు మాత్రమే అవకాశం ఉందని పేర్కొన్నారు.మరిన్ని వివరాలకు కేజీబీవీ అన్నపురెడ్డిపల్లి కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ

- బోడు పోలీస్ స్టేషన్‌లో విస్తృత అవగాహన సదస్సు
- ఓటీపీ, బ్యాంకు వివరాలు ఎవరికీ ఇవ్వొద్దు..
- మోసపోతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయండి ఎస్సై రాజమౌళి



**టేకులపల్లి,జూలై27, ప్రజాజ్యోతి:** డిజిటల్ యుగంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల నుంచి ప్రజలు తమను తాము రక్షించుకోవాలంటే అప్రమత్తతే ప్రధాన ఆయుధమని బోడు పోలీస్ స్టేషన్ ఎస్సై రాజమౌళి పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు సోమవారం టేకులపల్లి మండలం బోడు పోలీస్ స్టేషన్‌లో సైబర్ నేరాలపై విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజమౌళి మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్లు కొత్త, కొత్త పద్ధతులతో అమాయకే ప్రజలను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్, వాట్సాప్ లింకులు, బ్యాంకుల పేరుతో వచ్చే నకిలీ సందేశాలను నమ్మి స్పందిస్తే భారీ ఆర్థిక నష్టాలు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు.ప్రభుత్వ అధికారులు, బ్యాంకు సిబ్బంది లేదా పోలీసుల పేరుతో ఫోన్ చేసి ఓటీపీ, ఏటీఎం పిన్, బ్యాంకు ఖాతా వివరాలు అడిగే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని సూచించారు. ఫోన్‌లో చెప్పినట్లు యాప్‌లు డౌన్‌లోడ్ చేయడం, తెలియని లింకులను క్లిక్ చేయడం ప్రమాదకరమని తెలిపారు. ముఖ్యంగా రైతులు రైతుబంధు, సబ్సిడీలు, రుణమాఫీ, ప్రభుత్వ పథకాల పేరుతో వచ్చే నకిలీ కాల్స్, సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద కాల్స్ లేదా సందేశాలు వస్తే వెంటనే సంబంధిత బ్యాంకు లేదా పోలీసులను సంప్రదించాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత సమాచారం, ఆధార్, పాన్, బ్యాంకు వివరాలను పంచుకోవద్దని, బలమైన పాస్‌వర్డ్‌లు ఉపయోగించి తరచూ మార్చుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ లావాదేవీలు అధికారిక వెబ్‌సైట్లు, విశ్వసనీయ యాప్‌ల ద్వారానే నిర్వహించాలని తెలిపారు.సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ హెల్ప్‌లైన్కు ఫిర్యాదు చేయడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు. ప్రజల్లో అవగాహన పెరిగితేనే సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని, ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులకు కూడా ఈ అంశాలపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నాగయ్య, హెడ్ కానిస్టేబుల్ ఖాదీర్, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు, రైతులు, యువత పాల్గొని సైబర్ నేరాల నివారణకు సంబంధించిన పలు సూచనలు తెలుసుకున్నారు.

## ఆపరేషన్ ముష్కన్ బృందం తనిఖీలు

- మైనర్ ను పనిలో పెట్టుకున్న షాపు యజమనిపై కేసు నమోదు

**ములకలపల్లి, జూలై 27 (ప్రజాజ్యోతి ):** మండలంలోని జగన్నాథపురం, ములకలపల్లి గ్రామాల్లోని దుకాణాలు, మెకానిక్ షాపులు, జామాయిల్ ఆడితిలు, తదితర వ్యాపార సంస్థల్లో సోమవారం ఆపరేషన్ ముష్కన్ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. పాల్వంచ డివిజన్ ఇన్‌చార్జి ఎస్ఐ రాంమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో బాల కార్మికుల కోసం విస్తృతంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ములకలపల్లి మండల కేంద్రంలోని ఓ ఎలక్ట్రికల్ షాపులో పని చేస్తున్న బాలుడిని గుర్తించిన ముష్కన్ బృందం అతడిని రెస్క్యూ చేసింది. బాలుడిని పనిలో పెట్టుకున్న షాపు యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్వైజర్ లలిత ములకలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముష్కన్ బృందం ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ మధు ప్రసాద్ షాపు యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ రెస్క్యూ కార్యక్రమంలో పాల్వంచ డివిజన్ ముష్కన్ బృందం సభ్యులు, డీసీపీయూ అవుట్‌రీచ్ వర్కర్ రాజు , పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వర్షాన్నీ లెక్కచేయని ఎమ్మెల్యే

- తడుస్తూనే కార్యకర్తలకు దిశానిర్దేశం
- పెగల్లపాడులో కాంగ్రెస్ సమావేశం ఉత్సాహ భరితం
- మండల అధ్యక్షుడు లక్కినేని శ్యామ్‌కు జన్మదిన శుభాకాంక్షలు






**టేకులపల్లి,జూలై 27,ప్రజా జ్యోతి:** కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా గ్రామస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టేకులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా లక్కినేని శ్యామ్ నియామకాన్ని పురస్కరించుకుని సోమవారం పెగల్లపాడు గ్రామపంచాయతీలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.సమావేశంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా భారీ వర్షం ప్రారంభమైనప్పటికీ, ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిలిపివేయకుండా వర్షంలోనే ప్రసంగాన్ని కొనసాగించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారీ వర్షాన్ని కూడా లెక్కచేయ కుండా వందలాది మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు అక్కడే ఉండి ఎమ్మెల్యే ప్రసంగాన్ని ఆసక్తిగా ఆలకించారు. వర్షంలో తడుస్తూనే నాయకుడు కార్యకర్తలకు మార్గనిర్దేశం చేయడం కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఇదే రోజు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కినేని శ్యామ్ జన్మదినం కావడంతో ఎమ్మెల్యే కోరం కనకయ్య కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో మరింత విజయ వంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కురిసిన వర్షాన్ని కార్యకర్తలు శుభసూచకంగా అభివర్ణిస్తూ, "వాన దేవుడు కూడా కాంగ్రెస్ పార్టీ సమావేశాన్ని ఆశీర్వదించాడు" అంటూ హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వర్లు, పెగల్లపాడు సర్పంచ్ కోరం హనుమంతు, కొత్త తండా సర్పంచ్ అరుణ, మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణ సోమవారం వేళ మల్లిఖార్జున స్వామికి విశేష అభిషేకాలు

- రుద్రాభిషేకాలు, అర్చనలతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం
- అన్నదాన సేవ నిర్వహించిన ఆయలూరి వెంకట చలపతిరెడ్డి-ప్రవళిక దంపతులు





**అన్నపురెడ్డిపల్లి, జూలై 27 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకొని సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకాలు, అభిషేకాలు, అర్చనలు, మహామంగళహారతి నిర్వహించగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది.శ్రావణ సోమవారం కావడంతో మండలంలోని పలు గ్రామాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి తల్లాడ మండలం కొరనవెల్లి గ్రామానికి చెందిన ఆయలూరి వెంకట చలపతిరెడ్డి, ప్రవళిక దంపతులు సహకారం అందించారు. వారి ఆధ్వర్యంలో భక్తులకు స్వామివారి మహాప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో వడ్డించారు.అన్నదానంలో పాల్గొన్న భక్తులు దాతలను అభినందిస్తూ స్వామివారి ఆశీస్సులు అందరికీ కలగాలని ఆకాంక్షించారు. ఆలయ సేవలను మేనేజర్ పి.వి. రమణ పర్యవేక్షించగా, పూజా కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో కొనసాగాయి. శ్రావణ సోమవారం సందర్భంగా ఆలయంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

## ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను సమర్థంగా అమలు చేయాలి




**పినపాక, జూలై 27 (ప్రజాజ్యోతి ):** శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా కృషి చేయాలని మండల విద్యాధికారి (ఎంఈఓ) కొమరం నాగయ్య అన్నారు.ఈ నెల 21వ తేదీ నుంచి పినపాక జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు విడతలుగా ఆరు రోజుల పాటు నిర్వహించిన ఇన్-సర్వీస్ ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, శిక్షణలో పొందిన నైపుణ్యాలను పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు.తెలుగు, ఇంగ్లీష్, గణితం సులభ బోధన పద్ధతులు, రెమిడీయల్ తరగతుల నిర్వహణతో పాటు శిక్షణలో వివరించిన ఇతర బోధనా విధానాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామిరెడ్డి, రిసోర్స్ పర్సన్లు రాజేశ్వరరావు, కృష్ణయ్య, బాబురావు, షాలిని, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు

- మూడుసార్లు సీజ్ చేసిన తోగ్గూడెం క్వారీలపై తేలాల్సిన వాస్తవాలు
- సమగ్ర విచారణ కోరుతూ కొంతకాలంగా ప్రజా సంఘాల ఆందోళన
- గతంలో రాజకీయ పార్టీలు.. ఇప్పుడు గిరిజన, ప్రజా సంఘాలూ ఒకే డిమాండ్
- రాయల్టీ నష్టం, ఆర్టీఐ వివరాలు, పర్యావరణ అంశాలపై ప్రశ్నలు
- పారదర్శక విచారణతోనే అనుమానాలకు తెరపడుతుందన్న అభిప్రాయం
- అధికారుల మౌనం వెనుక పలు అనుమానాలు..




# మైనింగ్ అక్రమాలపై మౌనం ఎందుకు..?

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 27 (ప్రజాజ్యోతి):** పాల్వంచ మండలం తోగ్గూడెం గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మైనింగ్ వ్యవహారం మరోసారి జిల్లా వ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఈ ప్రాంతంలో చాలాకాలంగా అక్రమ మైనింగ్ జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై గతంలో రాజకీయ పార్టీలు విచారణ కోరగా, ఇప్పుడు గిరిజన సంఘాలతో పాటు పలు ప్రజా సంఘాలు కూడా అదే డిమాండ్‌ను బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు సమర్పించడం, నిరసన కార్యక్రమాలు నిర్వహించడం, కలెక్టరేట్ ముట్టడి వరకు వెళ్లడం జరిగినప్పటికీ పూర్తి స్థాయి విచారణ ప్రారంభమైనట్లు ఎలాంటి స్పష్టత లేకపోవడం చర్చకు కారణమవుతోంది. ఒకవైపు ఫిర్యాదులు పెరుగుతుండగా, మరోవైపు సంబంధిత శాఖల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించకపోవడంతో అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

## ♦ భారీ స్థాయిలో అక్రమ తవ్వకాలా..?

ప్రజా సంఘాల ఆరోపణల ప్రకారం తోగ్గూడెం పరిధిలో అనుమతుల పరిధిని దాటి పెద్ద ఎత్తున ఖనిజ తవ్వకాలు జరిగాయి. దీనివల్ల ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ ఆదాయానికి భారీ నష్టం వాటిల్లిందని వారు చెబుతున్నారు. ఇదే సమయంలో గిరిజనుల హక్కులు, సహజ వనరులు, పర్యావరణం కూడా దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తవ్వకాల అసలు పరిమాణాన్ని రికార్డుల్లో తక్కువగా చూపించడం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం తగ్గిందని ఆరోపిస్తూ, మొత్తం వ్యవహారంపై సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా కోణాల్లో సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నారు. అయితే ఈ వ్యవహారంలో ఎక్కువగా చర్చకు వస్తున్న అంశం జిల్లా మైనింగ్ శాఖ గతంలో తోగ్గూడెం ప్రాంతంలోని కొన్ని క్వారీలను మూడుసార్లు సీజ్ చేసిన విషయమే. ఒకవేళ ఎలాంటి అక్రమాలు జరగకపోతే సీజ్ చేసే పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. మరోవైపు సీజ్ చేసిన తర్వాత మళ్లీ కార్యకలాపాలు ఎలా ప్రారంభమయ్యాయి, అందుకు ఎవరి అనుమతి ఉంది, అధికారులు ఎలాంటి పర్యవేక్షణ చేశారు అనే అంశాలపై కూడా పూర్తి స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా అసలు వాస్తవాలు బయటకు రావాలంటే స్వతంత్ర విచారణ ఒక్కటే మార్గమని వారు అభిప్రాయపడుతున్నారు.

## ♦ ఆర్టీఐ వివరాలపైనా సందేహాలు..

ఇదే సమయంలో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద పొందిన వివరాలపైనా ప్రజా సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఒకవైపు అన్ని క్వారీలకు చట్టబద్ధమైన అనుమతులు ఉన్నట్లు సమాచారం ఇవ్వడం, మరోవైపు అక్రమాలపై చర్యలు తీసుకున్నామని సంబంధిత శాఖ చెప్పడం పరస్పర విరుద్ధంగా ఉందని వారు పేర్కొంటున్నారు. దీంతో ఆర్టీఐ ద్వారా ఇచ్చిన వివరాలు, మైనింగ్ శాఖ రికార్డులు, తవ్వకాల లెక్కలు, రాయల్టీ చెల్లింపులు, అనుమతులు, తనిఖీ నివేదికలు అన్నింటినీ ఒకేసారి పరిశీలించాలని కోరుతున్నారు. దీనితో పాటు పర్యావరణ అనుమతులు, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) నిబంధనలు, ఇతర చట్టపరమైన మార్గదర్శకాలు అమలయ్యాయా లేదా అన్న అంశాలను కూడా విచారణలో భాగం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## ♦ అన్ని వైపులా ఒకే డిమాండ్..

ఈ వ్యవహారంపై గతంలో భారతీయ జనతా పార్టీ నాయకులు కూడా సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పుడు గిరిజన సంఘాలు, ప్రజా సంఘాలు కూడా అదే డిమాండ్‌తో ముందుకు రావడం గమనార్హం. వేర్వేరు వర్గాలు వేర్వేరు సందర్భాల్లో ఒకే అంశాన్ని ప్రస్తావిస్తుండటంతో ఈ వ్యవహారంపై అధికారికంగా సమగ్ర దర్యాప్తు చేపట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం బలపడుతోంది. ప్రజా సంఘాల అభిప్రాయం ప్రకారం అక్రమాలు జరిగి ఉంటే వాటికి పాల్పడిన వారితో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించినా, సహకరించినా సంబంధిత అధికారుల పాత్రను కూడా విచారించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే ప్రజలు, ప్రజా సంఘాలు, గిరిజన సంస్థలు, రాజకీయ పార్టీలు వరుసగా ఒకే అంశంపై ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ వ్యవహారాన్ని సాధారణ ఫిర్యాదుగా కాకుండా ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశంగా పరిగణించి పారదర్శకమైన, నిష్పాక్షికమైన విచారణ చేపట్టాలని స్థానికంగా డిమాండ్ వ్యక్తమవుతోంది.

## మైనింగ్ శాఖపై ఎందుకీ వరుస ప్రశ్నలు..?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మైనింగ్ శాఖ పనితీరుపై ప్రశ్నలు రావడం తోగ్గూడెం వ్యవహారంతోనే మొదలైన విషయం కాదు. గత కొంతకాలంగా జిల్లాలో అక్రమ ఇసుక రవాణా, అనుమతులకు మించి మట్టి తవ్వకాలు, క్వారీల నిర్వహణ, రాయల్టీ వసూళ్లు, తనిఖీల తీరు వంటి పలు అంశాల్లోనూ సంబంధిత శాఖ పనితీరుపై ఆరోపణలు, విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న కార్యకలాపాలు ఒకలా ఉంటే, అధికారిక రికార్డులు మరోలా కనిపిస్తున్నాయనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు వచ్చినప్పుడే పరిమిత చర్యలు తీసుకోవడం, కొంతకాలం తర్వాత పరిస్థితి మళ్లీ యథాతథంగా మారడం వల్ల శాఖ పర్యవేక్షణ సామర్థ్యంపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి ఘటనను విడివిడిగా చూడకుండా, జిల్లాలో మైనింగ్ కార్యకలాపాలపై మొత్తం వ్యవస్థ ఎలా పనిచేస్తోంది, పర్యవేక్షణలో ఎక్కడ లోపాలు ఉన్నాయి, నిబంధనల అమలు ఎంతవరకు జరుగుతోంది అనే అంశాలపై సమగ్ర సమీక్ష అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ తరహా ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం రావాలంటే తోగూడెం వ్యవహారంతో పాటు జిల్లాలో గత కొంతకాలంగా వెలుగులోకి వచ్చిన మైనింగ్ సంబంధిత అంశాలన్నింటిపైనా పారదర్శకంగా, నిష్పాక్షికంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉందని పలువురు భావిస్తున్నారు.

# ఇసుక మేటల పేరుతో తవ్వకాలా...?

- భారీ గోతులు తీస్తే వ్యవసాయం సాధ్యపడుతుందా...?
- తహసీల్దార్‌కు తాళ్లపాయి పాలకవర్గం ఫిర్యాదు చేసినట్లు సమాచారం







**ములకలపల్లి, జులై 27 (ప్రజాజ్యోతి):** మండలంలోని మంగలిగుట్ట పాములేరు వాగులో ఇసుక మేటల తొలగింపు పేరుతో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయంటూ స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2022లో పాములేరు వాగు పరివాహక ప్రాంతానికి చెందిన కొందరు రైతులు తమ వ్యవసాయ భూముల్లో ఉన్న ఇసుక మేటలను తొలగించేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. వారికి అనుమతులు మంజూరైనట్లు చెబుతున్నప్పటికీ, ప్రస్తుతం జరుగుతున్న తవ్వకాలు అదే అనుమతుల పరిధిలో జరుగుతున్నాయా లేదా అన్నది అధికారులు ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదని స్థానికులు అంటున్నారు. స్థానికుల వాదన ప్రకారం, సంబంధిత భూముల సరిహద్దులను అధికారులు గుర్తించకుండానే, టీజీఎండీసీ అనుమతులు ఉన్నాయని చెబుతూ కొందరు భారీ యంత్రాలతో వాగులో ఇసుక తవ్వి రాశులుగా పోస్తున్నారని ఆరోపిస్తున్నారు.

## ››› నిబంధనలకు పాతర ...?

ఇసుక మేటల తొలగింపునకు అనుమతులు ఇచ్చినట్లయితే, సంబంధిత సర్వే నంబర్లను అధికారులు మరోసారి ధృవీకరించి, భూమి హద్దులను నిర్ణయించి, అధికారుల పర్యవేక్షణలో అనుమతుల్లో పేర్కొన్న లోతు వరకు మాత్రమే ఇసుక తొలగించాల్సి ఉంటుందని తెలిసింది. అవసరమైన పర్యవేక్షణ, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి నిబంధనలు అమలు కావాల్సి ఉండగా, ప్రస్తుతం అవి పాటించకుండానే తవ్వకాలు జరపడంతో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

## ››› భారీ గోతులతో వాగు దిశ మారే ప్రమాదమా...?

తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో భారీ యంత్రాల తో 15 నుంచి 20 మీటర్ల గోతులు తీస్తున్నారని ఇంత భారీ గోతులు తీస్తే ఆ భూములు వ్యవసాయానికి ఎ లా పనికి వస్తాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వాగు ప్రాంతంలో భారీ గోతులు తీయడంతో భవిష్యత్తులో వాగు సహజ ప్రవాహ దిశ మారే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు పొందిన సర్వే నంబర్లను, సం బంధిత భూములను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి హద్దులు నిర్ణయించి, నిబంధనల ప్రకారమే తవ్వకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ››› తహసీల్దార్‌కు తాళ్లపాయి పాలకవర్గం ఫిర్యాదు...?

మంగలిగుట్టలో జరుగుతున్న ఇసుక తవ్వకాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తాళ్లపాయి పాలకవర్గం స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, అన్ని అనుమతులు నిబంధనల ప్రకారమే ఉంటే ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందనే చర్చ స్థానికంగా సాగుతోంది. అలాగే ఈ వ్యవహారంపై రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.